

# టేకిట్ ఈజీ!! - 2

శ్రీనివాస ఫణికుమార్ డొక్కా



## శీనిగాడూ - కెరీరూ - శోభంబాబూ

## ( తుది భాగం)

అలా పైకి చెప్పకపోయినా, ఒక శోభన్ బాబూ, ఒక ఘంటసాలా నాలో ప్రాణంపోసుకుని అవకాశంకోసం ఎదురుచూస్తున్నారు. సరే మనకి అబ్బవలసిన చదువు ఎలాగూ అబ్బింది. ఫిజిక్స్ లో పొట్ట భద్రుణ్ణి, ఐమీన్ పట్ట భద్రుణ్ణి చేసేసి, పీ.హెచ్.డీలో సీటుకూడా ఇప్పిస్తానని బెదిరించింది విధి. ఉన్నవి చదవడానికే ఓపిక లేదు, కొత్తవి కనిపెట్టడం కూడానా. కొంపతీసి ఏవన్నా కనిపెట్టేస్తే, తరవాతి తరాల్లో నాలాంటి కుర్రాళ్ళు ఈ దిక్కుమాలిన సిద్ధాంతాలన్నీ చదవలేక, నామీద పడి ***అలో లక్ష్మణా*** అని ఏడవరూ? అంచేత పరిశోధకుడి కెరీరుకి గండికొట్టే విధంగా అమెరికా చదువుకి అప్లై చేసా, అందరి లాగే. *రాసిన పాపం చెబితే పోతుంది*, ఆ అప్లికేషన్లలో ఎన్ని రాసాననీ. నేను ఐన్‌స్టీను ఐదవ అవతారాన్ననీ, ఆయన పేరుమీద తారనాకా లో సైన్స్ మఠం స్థాపించాననీ, ఆయనలాగే జుట్టు దువ్వుకోననీ, అసలు ఇ ఈజీక్వల్‌టూ ఎం, సీ క్యూబ్ అని నా సిద్ధాంతమనీ, దాన్ని పేరమ్మగ్రహారం సైన్సు జర్నల్‌లో ప్రచురించాననీ, ఇలా ఎన్నో అబద్ధాలు. అన్నీ అబద్ధాలే, ఒక్క జుట్టు విషయం తప్ప. అయినాసరే, వాడి ఖర్మకాలి నాకు ఎడ్మిషన్ ఇచ్చి, మద్రాసుకిపోయి వీసా తెచ్చుకోమన్నాడు. మళ్ళీ అబద్ధాలు మొదలు.

***" అసలు నువ్వు అమెరికా ఎందుకు వెడుతున్నావు? "*** అని అడిగాడు పి.ఎ కం **మాక్ ఇంటర్వ్యూ** (ఉత్తుత్తి ఇంటర్వ్యూ) సెటప్ చేసిన బతకనేర్చిన సంస్థవాడు.

***"మరీ ఇంత డైరెక్ట్‌గా అడిగితే ఏ బెమ్మచారి మాత్రం ఏంచెబుతాడు సార్."*** అన్నాను కొంచెం సిగ్గు పడుతూ.

***"ఏడిసినట్టేవుంది, ఏదో ఒకటి చెప్పేడు.."*** అన్నాడు విసుగ్గా.

***"అంటే ఫ్రం చైల్డ్‌హుడ్ ఐ వాంట్ టు బికం శోభన్ బాబు అన్నమాటండి, అమెరికాలో వైట్ అమ్మాయిలు మన హీరోయిన్ల కన్నా గుడ్ లుకింగ్ అండి. అందుకని వెడుతున్నానండి..." .*** అన్నాను అమాయకంగా.

ఆయన కుర్చీ లోంచి లేచి ***" రేయ్.. నేను సి.ఎ ని కాకుండా ఏ సి.ఐ నో అయ్యుంటే, ఈ పాటికి నాలుగు సెక్షన్ల కింద నిన్ను బొక్కలోకి తోద్దును. ఇలా చెబితే వీసా కాదు, విజిటింగ్ కార్డు కూడా ఇవ్వరు. ఏదో చదువుకుందుకు వెడుతున్నాననీ, ఇక్కడ బోలెడంత అగ్రికల్చరల్ లాండ్ ఉందనీ, అమ్మా, నాన్నని నువ్వే చూసుకోవాలనీ, అంచేత చదువవ్వగానే వచ్చి తగలడతాననీ చెప్పి ఛావు.."*** అనేసి, ఆ రోజుకి దుకాణం కట్టేసి వెళిపోయాడు. పాపం ఆయన లేత మనసు చాలా కలత చెందినట్టు నాకనిపించింది.

సరే, సూక్ష్మం చెప్పాడు కదా, ఇంక అల్లుకుపోయాను నేను వీసా కౌంటర్ లో.

***" మిష్టర్ దుక్కా, వై ఆర్ యూ గోయింగ్ టూ అవర్ కంట్రీ ? "*** అడిగాడు కౌంటర్ కి అటున్న శాల్తీ.

తెల్లారుఝాము నించీ బయట నించుని నించుని కాళ్ళు పీకేస్తున్నాయి, అసలే నిద్దరలేదు, ఈ గొడవేంట్రా బాబూ, అనుకుని...***"ఏక్చువల్లీ ఐ లైక్ శోభన్ బాబు, ఐయాం లైక్ శోభన్ బాబు, గోయింగ్ ఫర్ హీరోయిన్ సెర్చ్ "*** అన్నాను నిద్రమత్తులో.

అటునించి ***"వ్వాట్.."*** అని వినిపించింది. వెంఠనే నిద్రమత్తు వదిలిపోయి నేను లైన్ లోకి వచ్చేసాను. అప్పుడు నేను చెప్పినదాని తెలుగు సారాంశం ఇది...

***" మాకు సుమారు నలభై ఎకరాలు పొలము గలదు. మా నాన్నగారు ఒక రైతు. ఆయన ప్రతి ఉదయమూ పంచె కట్టుకుని, బలరాముడిలా నాగలి తీసుకుని పొలమునకు వెళ్ళి దుక్కి దున్నెదరు. కాసేపటికి మా అమ్మ వచ్చి విత్తనములు జల్లును. లంచ్ టైములో వారు గంజి తాగుదురు. ఇంతలో వానపడి పొలము పండును. సాయంత్రమునకు పంట కోసుకుని వచ్చి, రాత్రి పంటని వండుకుని తినెదరు. ఇలాగే రోజూ చేయుదురు."***

అంతే, అదివిని, వాడు కౌంటర్ లో లైటు ఆపేసి, ఇవతలికొచ్చి నాకు సాష్టాంగ ప్రమాణం చేసి చెప్పిన దాని తెలుగు సారాంశం..

***"ఒక్క రోజులో దుక్కి దున్నేసి, విత్తనాలేసేసి, పంట పండిచ్చి, ఇంటికి పట్టించి, వండుకు తినేస్తున్నారా బాబూ? ఇంత టెక్నాలజీ ఇక్కడ ఉందని మా వాళ్ళకింకా తెలియదు. దయచేసి నువ్వు మళ్ళీ నాకు కనపడకు. నామీద ఆధారపడ్డ నా పెళ్ళాం, పిల్లల సాక్షిగా చెబుతున్నాను. నీకిప్పుడు వీసా ఇవ్వకపోతే, నువ్వు మళ్ళీ వస్తావు, అప్పుడు నిన్ను***

***మళ్ళీ చూడవలసి వస్తుందేమో అనే ఒకే ఒక్క భయంతో నీకు వీసా ఇచ్చేస్తున్నాను. నిజంగా ఇలాంటి క్రేజీ ఫ్లవర్ ని నా జీవితంలో చూడలేదు..".***

ఆ తరవాత నన్ను ఎవ్వరూ వీసా ఫీజు కట్టమని కూడా అడగలేదు. బహుశా, ఆయనకట్టేసుంటాడు. అయినా పంటెలా పండిస్తారో నాకు మాత్రం ఏం తెలిసి చచ్చు ? ఏదో ఆ సి.ఎ గాడు చెప్పమన్నాడు, మనం అల్లేసాం...

సరే, ఈ దేశం వచ్చేసాం కదా, ఇక్కడైనా నా పంట పండుతుందనుకున్నాను. ఎక్కడా, కుదరండే మా ఫిజిక్స్ క్లాసులో ఒకే ఒక్క అమ్మాయి. ***గొంతువిన్నాకా తెలిసింది, అమ్మాయని.*** ఎందుకులెండి, ప్రపంచమంతా ఒఖ్ఖలాగే ఏడిసింది. అయినా తప్పు **ఫిజిక్** లో కాదు, అసలు **ఫిజిక్స్** లో ఉందనుకుంటాను. ఇలా నిరుత్సాహపడిన క్షణాన, ప్రతి శుక్రువారం రాత్రి తొమ్మిది గెంటలకు ఒక లాబ్ పాఠం చెప్పే అవకాశం రావడం, అక్కడికి పెద్ద వయస్సు వారితో బాటు, ఇద్దరు అప్సరసలు రావడం జరిగింది. వారి మధ్యలో నేనేవిటి, ఎవరన్నా శోభన్‌బాబే అనుకుని వారికి ***స్క్యూగేజీ, వెర్ నియర్ కాలిపర్స్*** లాంటి ప్రయోగాలు క్లాసులో దగ్గరుండి నేర్పిద్దామనుకున్నాను. దగ్గరికి వెళ్ళాకా తెలిసింది, ఒహటే బీరు వాసన. కడుపులో తిప్పేసింది. నెక్స్ట్ క్లాసునించీ వీళ్ళకి వక్కపొడి అలవాటు చేద్దామని డిసైడయ్యాను. కానీ నా డిసైడ్‌మెంటు తెలియక వాళ్ళు సైడ్ అయ్యారు. వాకబు చేస్తే తెలిసింది. వాళ్ళు ఏదో ***కరెక్షన్ ఫెసిలిటీ (అనగా మన భాషలో జైలు)*** లో బిజీగా ఉన్నారని.. ఏంచేస్తాం.. జాతకం..

అలా కెరీరులో ఏంకావాలో, ఎలా కావాలో తెలియక, డబ్బులిస్తారని కంప్యూటర్ చదువులు చదివాను. డబ్బులిచ్చారు. ఇస్తున్నారు. సరైన సమయం చూసి, జయప్రదలాంటి వీరోయిన్నిచ్చి పెళ్ళిచేసి నన్ను సడెన్‌గా శోభన్‌బాబుని చేసేసారు ఇంట్లోవాళ్ళు. నాపాటవినేసి ***"హేమండీ, అసలు టూ..మచ్చి.అచ్చు ఘంటసాల ఎస్.పీ పాటే నండీ.."*** అనేసింది నా వీరోయిన్ను.

పాయింటేంటంటే.. ఒక్కో ఉజ్జోగంలో ఒక్కో పని. ప్రతి ఉజ్జోగానికి ముందూ రెజ్యూమే రాయాలి. కావలసినన్ని అబద్ధాలాడాలి. ఆ మధ్యన కొన్నేళ్ళక్రితం ఉజ్జోగం పోయింది. అప్పుడు కొంచెం డెస్పరేట్ అయ్యి, నా శక్తికొలది పన్నెండు రెజ్యూమేలు చేసి ప్రపంచమ్మీదకొదిలాను. వాటి గురించి ఇప్పటికీ ఫోన్లు వస్తున్నాయి. ఆ మధ్యన ఫ్రాన్స్ నించి ఫోను, స్త్రీల ఫాషన్ దుస్తులు తయారు చేసే కంపెనీ నించి. నేను అర్జెంటుగా వచ్చి ఉద్యోగంలో చేరాలనీ, లేకపోతే వాళ్ళ కంపెనీ మూసేస్తారనీని. అలాగే, ఆ మధ్యన దుబాయ్‌లోని ఒక పెద్ద అంతర్జాతీయ బేంక్ నించి ఒక కాల్ " వాళ్ళ అధినేత కాలధర్మం చేసాడనీ, పోతూ పోతూ తనవారసుడిగా నన్ను ఎంపిక చేసాడనీ, డెత్‌బెడ్ మీద నాగురించే కలవరించాడనీని. "

హిల్లా అబద్ధాలాడీ ఆడీ చికాకెత్తిపోయింది. విసుగొచ్చేసింది. అందుకే నేను జీవితంలో ఏవీ కాకూడదనీ, అయితే అన్నీ అవ్వాలనీ డిసైడ్ అయిపోయాను. అందుకనే రేపుమీద భయం లేకుండా కాలుమీద కాలేసుకుని కీబోర్డు మీద వేళ్ళేసుకుని బతికేస్తున్నాను. నామటుక్కునాకు నేనే శోభన్ బాబునీ, నేనే ఘంటసాలనీను. అయినా నన్ను మరొహాడు సర్టిఫై చెయ్యడవేవిటి. వాడేవన్నా గోవింద దాసా? అందుకే నాఅంతటి వాణ్ణి నేను. కౌపీన సంరక్షణార్థం తప్ప, ఇతర సమయాల్లో రెజ్యూమేలూ, కేరీర్లూ వాటి జోలికి పోను. నేనేదో ప్రొఫెషనల్‌ని అనుకోను. అవసరం కాబట్టి కొన్ని పనులు చేస్తాను. నచ్చుతాయి కాబట్టి మరికొన్ని పనులు చేస్తాను.

మొన్న మా పిల్ల **"మెటిల్డా"** అనే సినిమాలో ప్రతి సీనూ, అన్ని పాత్రలూ తనే అయి, గుక్కతిప్పుకోకుండా నటించి చూపిస్తోంది. **నలభయ్యయిదు** నిమిషాలయ్యాకా దాన్ని ఆపి అడిగేను. ఎలా గుర్తున్నాయే ఇవన్నీ అని .

***" నాకు ఇంటెస్టు నాన్నా..నీకో నిజం చెప్పనా. ఇఫ్ ఇట్ ఈజ్ అప్ టు మి, నేను పేద్ద స్టేజి మీద ఏక్టర్ ని అవుతాను.."*** అంది చేతులు వయ్యారంగా గాల్లోకి లేపి, మా రూఫ్ కేసి ఒక ఏంగిల్ లో తల తిప్పి చూస్తూ.

నేను ఒక నిట్టూర్చాను..***"ఎక్కడికి పోతాయి , తండ్రి పోలికలు.."*** అనుకుని దాన్ని దగ్గరకి తీసుకున్నాను, దాని భవిష్యత్తు కెరీరు మలుపులు ఊహించుకుంటూ, దాని రెజ్యూమే తలుచుకుంటూ, హాయిగా నవ్వుకుంటూ....

## (వచ్చే సంచిక దాకా లైట్ తీస్కోండి!)

POST YOUR COMMENTS